విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల

- విద్యార్థుల, తల్లుల జాయింట్ ఖాతాల్లో రూ.26.42 కోట్లు జమ
- 32,452 మంది విద్యార్థులకు లబ్ధి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద అక్టోబరు-నవంబరు 2023 త్రైమాసికానికి సంబంధించి 32,452 మంది విద్యార్థులకు సంబంధించి వారి తల్లులు, విద్యార్థుల జాయింట్ బ్యాంక్ ఖాతాలకు రూ. 26.42 కోట్లు నిధులు విడుదల చేసినట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా తల్లులు, విద్యార్థుల, జాయింట్ ఖాతాల్లో డబ్బులు జమచేయగా ఈ కార్యక్రమంలో ఏలూరు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, జిల్లా బి.సి. సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, మైనారిటీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, పలువురు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులైన పేద విద్యార్థులు పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లులు, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో నేరుగా జమ చేస్తోందన్నారు. ఏలూరు జిల్లాలో 8,052 ఎస్సీ విద్యార్థులకు గాను రూ.6.15 కోట్లు, ఎస్.టి విద్యార్థులు 1,478 మందికి రూ. 79 లక్షలు, బి.సి విద్యార్థులు 14,835 మందికి రూ.12.13 కోట్లు, ఇ.బి.సి విద్యార్థులు 2,728 మందికి రూ. 2.79 కోట్లు, ముస్లిం మైనారిటీ విద్యార్థులు 852 మందికి రూ. 74 లక్షలు, కాపు విద్యార్థులు 4,137 మందికి రూ. 3.35 కోట్లు, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు 370 మందికి రూ. 29 లక్షలు, వెరశి మొత్తం 32,452 మంది విద్యార్థులు, 29,281 మంది తల్లులకు చెందిన ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము ప్రభుత్వం జమచేసిందన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

విశాలాంధ్ర-ఏలూరు: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం. శ్రీహరిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. అబ్రహం సస్పెండ్ చేశారు.విధుల పట్ల అలసత్వం ,నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడమే కాకుండా రెండు నెలలుగా ప్రతిరోజు ఉదయం గం.10లకు పాఠశాలకు ఆలస్యంగా వస్తున్న ముదినేపల్లి మండలం చెరువు ఎంపీ యు పి స్కూల్ లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ టీ. ఆంజనేయులు అనే టీచర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డయల్ యువర్ ఎస్పికి 6 ఫిర్యాదులు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డయల్ యువర్ ఎస్పి కార్యక్ర మానికి 06 ఫోన్ కాల్స్ వచ్చాయని, ఎస్పి అజిత వేజెండ్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫోన్ కాల్ లో ఆకివీడు గ్రామం నుండి ఒక అర్జీదారు ఫోన్ చేసి తాను ఒక ఆటోలో ప్రయాణిస్తూ హ్యాండ్ బ్యాగ్‌ను మర్చిపోగా అందులో ఉన్న బంగారం పోయిందని, అ విషయంపై జనవరి 11 వ తేదీన ఆకివీడు పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదని ఫిర్యాదు చేశారు. ఎస్పి తక్షణమే ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని ఆకివీడు పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. ఇదే మాదిరిగా ప్రతి శుక్రవారం డయల్ యువర్ ఎస్పి కార్యక్రమం ఉంటుందని, ఫిర్యాదుదారులు "9000110289" ఉదయం గం. 11 నుంచి 12 వరకు ఫోన్ చేసి స్వయంగా ఎస్పితో మాట్లాడవచ్చన్నారు.

ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల ప్రకారం సిస్టమెటిక్ వాటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్" ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ కార్యాలయం ఎదుట మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన భాను నాయక్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని, ఓటు విలువ తెలుసుకోవాలని విన్నవించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో డాక్టర్ రఫీ, డాక్టర్ ప్రసాద్,డాక్టర్ ఝాన్సీ,డాక్టర్ నాగలక్ష్మి, శ్రీవిజ్ఞాన వేదిక సోషల్ వర్కర్ పి. రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

6న పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో ఈ నెల 6 వ తేదీ బుధవారం నుండి పొగాకు కొనుగోలు ప్రారంభిస్తు న్నట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ గ్రేసి మార్గరెట్ తెలిపారు. ఎస్.ఎల్.ఎస్. పరిధిలో మొత్తం 5 పొగాకు వేలం కొనుగోలు కేంద్రాలు అదే రోజున ప్రారంభమవుతాయని రైతులంతా తమ పొగాకు బేళ్లను విక్రయించడానికి సిద్ధంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

విశాలాంధ్ర-భీమవరం: ప్రపంచ బ్యాంక్ వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీమ్ ద్వారా రాష్ట్రంలోనూ ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించడం జరిగిందని, ర్యాంప్లోని ఒక అంశ మైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్లో భాగంగా ప్రభుత్వం పరిశ్రమల శాఖకు సర్వే నిర్వహిస్తోందని, ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఏపీ ఎంఎస్ఎంఈ వన్ బ్యానర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్యరంగంలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేసి వాటిని డిజిటల్ ఫ్లాట్ ఫామ్ లోకి తీసుకువచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ.వన్ పోర్టల్ కు అనుసంధించడం ద్వారా ఎంఎస్ఎంఈల డేటా బేస్ ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని డేటా బేస్ లను అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యు.మంగపతి రావు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహ వార్డెన్ సస్పెన్షన్

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : జీలుగుమిల్లిలో ఫిబ్రవరి 19వ తేదీన గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ చేసి వసతి గృహం డిప్యూటీ వార్డెన్ కే నవీన్ కుమార్ ను సస్పెండ్ చేసినట్లు కె ఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం. సూర్య తేజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె. కృష్ణమోహన్ పై చర్యలు తీసుకునేందుకు ట్రైబల్ వెల్ఫేర్ సంచాలకులకు విజయవాడ వారికి సిఫార్సు చేసినట్లు వెల్లడించారు.

వైసీపీలో అయోమయం

- సతమతమవుతున్న సమన్వయకర్తలు
- తాయిలాలపైనే ఆశలు
- అసంతృప్తులు ఉన్నా ముందుకు
- ప్రలోభాలే దిక్కు

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: ఓ వైపు ప్రతిపక్ష తెదేపా, జనసేన జిల్లాలో 7గురి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి 'పంచ్' విసిరాయి. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లోఅంతులేని ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఎక్కడికక్కడ సంబరాలుచేసుకుని మిఠాయిలు పంచుకుంటున్నారు. గెలుపు తమదేననే ఆత్మ విశ్వాసంతో ఉన్నారు.అదే సమయంలో అధికార వైకాపా పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల స్థానంలో సమన్వయకర్తల పేరిట కథ నడుపుతోంది.

తాయిలాలపైనే దింపుడు కల్లం ఆశలు

సర్వేల పేరిట ఆశావహులతో అధిష్టానం ఆటాడుకుంటోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ప్రాతి నిధ్యం వహిస్తున్న స్థానాల నుంచి గెంటేసి డమ్మీలను చేసింది. తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా పాత స్థానాలను విడిచి కొత్త వాటిలో సమన్వయ కర్తలుగా బాధ్యతలు చేపట్టారు. సిట్టింగులుగా ఉన్న కొందరిని పక్కనపెట్టినా కిమ్మనలేని పరిస్థితి. ఈ పరిస్థితులన్నీ ఆ పార్టీ శ్రేణులలో తీవ్ర అయోమయం,గందరగోళానికి దారితీస్తున్నాయి.

చేసేదేమీ లేక

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలలో అధికార వైకాపా సమన్వయకర్తలను నియమించింది. తదనగుణంగా వారంతా ఆయా చోట్ల పరిస్థితిని చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. అసంతృప్తుల నుంచి ప్రతిఘటన ఎదురవుతున్నా భరిస్తున్నారు. కొందరు తమ ప్రచార భారాన్ని పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖ అధికారు పై వేసి ముందుకు సాగుతున్నారు. మరికొందరు ఆస్తులను తెగ నమ్మి కార్యక్రమాలు చేపడుతున్నారు. వ్యక్తిగత కారణాలతో ఈ దఫా ఎన్నికలలో పోటీకి దూరంగా ఉంటానని ప్రకటించి సీటు మార్చేసరికి సరేనంటూ తాయిలాల పంపిణీకి తెరలేపారు. స్థానిక నేతల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతున్నా తప్పనిసరి పరిస్థితులలో మరొకరు చేసేదేమీ లేక సర్దుకుపోతున్నారు.

ఐదేళ్లు ప్రజలను గాలికొదిలేసి

గత ఎన్నికలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు, ఉండి మినహా మిగిలిన 12 నియోజక వర్గాలలోను వైకాపా అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఐదేళ్లపాటు జిల్లా సమస్యలపై పట్టించుకున్నది లేదు. జిల్లా విభజన సమయం లోను ప్రజల వినతులపై పెదవి విప్పలేదు. వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు ఇలా రంగాల వారీగా తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్నా ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వలేకపోయారు. విపత్తుల సమయంలో పంట నష్టపోయినా, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకుంటామనే నమ్మకం కలిగించలేకపోయారు. పార్టీ ఆదేశాలను పాటించడం, పథకాల ప్రారం భానికి మాత్రమే పరిమితం అయ్యారు. తెలుగు ప్రజల జీవనాడి జాతీయ ప్రాజెక్టు పోలవరం, నిర్మాణం, నిర్వాసితులకు నష్టపరిహారం, చెల్లించడంలో వైసీపీ ఘోరంగా విఫలమైంది. పట్టిసీమ ద్వారా సాగు, తాగునీరు ఇవ్వడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మీనమేషాలు లెక్కించారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించారు. నరసాపురం తీర ప్రాంతంలో ఉప్పు రైతుల కోల్డ్ స్టోరేజీ నిర్మాణం ఊసే లేదు. మత్స్యకారుల కష్టాలు కన్నీళ్లు గానే మిగిలిపోయాయి. తమ నియోజకవర్గ పరిధిలోని అవినీతి అక్రమాలను ప్రోత్సహించడం, బినామీల ద్వారా వాటాలు పుచ్చుకోవడం తప్ప జిల్లా ప్రజల కోసం ఒక్క భారీ పరిశ్రమ తీసుకువచ్చిన దాఖలాలు లేవు.

ప్రలోభాలే చివరికి దిక్కు

ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో అధికార పార్టీ నేతలు తాయిలాలే తమకు ఓట్లు కురిపించేవిగా నమ్ముకుంటున్నారు. వాలంటీర్లను మధ్యపెట్టి తమకు అనుకూలంగా పని చేయించుకునేందుకు తహతహలాడుతున్నారు. వారితో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి నగదు, మిఠాయిలు, చీరలు, ఇతర బహుమతులు అందజేస్తున్నారు. బూత్ కమిటీ సభ్యులతో అభ్యర్థులను గెలిపించడానికి తాము సిద్ధం అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. అధికార వైకాపాలో సమన్వయకర్తలుగా నియమితులై తెర వెనుక ఉంటూ నియోజకవర్గాలలో తాయిలాలు పంపిణీ చేయిస్తూ ఆకట్టుకునే పనిలో తలమునకలై ఉన్నారు.

ఏలూరు పార్లమెంటు బరిలో కంభంపాటి రామ్మోహనరావు

విశాలాంధ్ర-ఏలూరు: తెలుగుదేశం పార్టీ ఏలూరు పార్లమెంటు అభ్యర్థిగా కంభంపాటి రామ్మోహన్‌రావును ఖరారు చేసినట్లు అనధికారికంగా సమాచారం అందుతోంది. తేదేపా అధిష్టానం ఆయన పేరును పరిశీలించి దాదాపుగా ఖరారు చేసినట్లుగా వినికిడి. కంభంపాటి రామ్మోహన్‌రావు ఆది నుండి తెలుగుదేశం పార్టీలోనే ఎదిగారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీ రామారావు హయాం నుంచే ఆయన ఎదుగుదల పార్టీలో ప్రారంభం అయ్యింది. రాజ్యసభ సభ్యుడిగా కూడా ఆయనను ఎంపిక చేశారు. చంద్రబాబు కూడా తన హయాంలో కంభంపాటికి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. చంద్రబాబు 2014లో అధికారంలోకి రాగానే కంభంపాటి రామ్మోహనరావును ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమించారు. ఢిల్లీలో రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారాలు చక్కదిద్దడానికి కంభంపాటిని చంద్రబాబు ఉపయోగించుకున్నారు.

చంద్రబాబుకు నమ్మిన బంటు

చంద్రబాబుకు నమ్మినబంటుగా ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పగలిగే నేతగా, అత్యంత వివాదరహితుడిగా ఉన్న మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు ఈసారి ఏలూరు పార్లమెంటు నుండి బరిలో దింపేందుకు తెలుగుదేశం పార్టీ రంగం సిద్ధం చేసినట్లు వినికిడి.

కార్మికుల సంక్షేమానికి ఏఐటియుసి పోరాటం

విశాలాంధ్ర-టి నరసాపురం : కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయుసి నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు అన్నారు. మక్కిన వారి గూడెం గ్రామంలో ఏఐటి యుసి కార్యాలయంలో ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం యూనియన్ అధ్యక్షులు మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ , సంక్షేమ స్కీం వర్కర్లు చేసిన సమ్మెకు ఏఐటీయుసి అండగా నిలిచి విజయం సాధించిందని అన్నారు. ఏఐటీయుసి ఉద్యమ ఫలితంగా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పడిందన్నారు. జగన్మోహనరెడ్డి సంక్షేమ బోర్డు సొమ్మును దారిమళ్ళించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి అసంఘటిత కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షులు కొండముచ్చు శ్రీనివాసరావు, యూనియన్ కార్యదర్శి కొప్పుల సతీష్ ఉపాధ్యక్షులు బైగాని ఏకాంబరం,కోశాధికారి ముసునూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

విశాలాంధ్ర- నూజివీడు:మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని నూజివీడు డిఎస్పి జి. లక్ష్మయ్య తెలిపారు. డిఎస్పీ లక్ష్మయ్య విలేకరు లతో మాట్లాడుతూ చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు శిక్ష అర్హులు అన్నారు. చిన్నపిల్లల్లో సరైన అవగాహన లేక వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: నేటి నుండి విద్యుత్ ఉన్నతాధికారులు మీటర్ రీడర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటి యుసి నగర కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో మీటర్ రీడర్స్ గా పని చేస్తున్న వారికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం పని దినాలు అమలు చేయాలని , ఎస్కో ఎకౌంటు ఓపెన్ చేయాలని కోరుతూ మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయుసి) శుక్రవారం నాడు ఏపీ ఈ పిడిసిఎల్ ఎస్ ఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఈ కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓ శ్రీనివాస రావు, కోశాధికారి మల్లేశ్వరరావు, ఏఐటీయుసి నగర కార్యదర్శి ఎ. అప్పలరాజు మాట్లాడుతూ గత నెల 16న మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు విద్యుత్ శాఖ ఇంధన కార్యదర్శి జేఎండి విజిలెన్స్ ఎస్పీడీసీఎల్ సిపీ డి సి ఎల్, ఈపీడీసీఎల్ సీఎండీలతో చర్చలు జరిపారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జంగారెడ్డి గూడెం డివిజన్ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, ఏలూరు డివిజన్ అధ్యక్షులు కే శ్రీధర్‌రావు, ఆర్. అప్పలస్వామి, డి. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు రూ.8 వేల పెన్షన్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర -భీమవరం: వృద్ధ కళాకారులకు రూ. 8000 పింఛన్ ఇస్తామని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్ కోరారు. శుక్రవారం భీమవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కళాకారులను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించుకుంటూ కళాకారులను పట్టించుకోవడంలేదని 64 రంగాల సకల కళాకారులు వృద్ధాప్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కళాకారుల సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి 8 వేల రూపాయలు పెన్షన్ గా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో చిన్ననాటి నుండి కళలకు అంకితమైన కళాకారులు ఎందరో గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్, కిడ్నీ వంటిభయంకరమైన ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడుతున్నారని వారందరికీ కూడా ప్రభుత్వం ప్రత్యేక వైద్య సహకారాలు ఉచితంగా అందించాలని ఆయన కోరారు. జవ్వాది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ చనిపోయిన కళాకారులకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందించట్లేదని కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారిని కళాకారులగా గుర్తించి మరణించిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన కోరారు. చాలామంది కళాకారులు గుర్తింపు కార్డుల కోసం, పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అవన్నీ చాలా పెండింగులో ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు పెన్షన్లు, కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు షేక్ చాన్ భాష, కాటి వెంకటరత్నం, భాష, షరీఫ్, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: సీపీఐ ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈనెల 4వతేదీ సోమవారం ఉదయం గం.10లకు బుట్టాయిగూడెంలో జరుగుతుందని ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సహాయ కార్యదర్శి కురెళ్ళ వరప్రసాద్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తిభవన్‌లో ఏలూరు ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం కురెళ్ళ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమ శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శరవేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సోమవారం జరుగనున్న జిల్లా జనరల్ బాడీ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య హాజరుకానున్నట్టు తెలిపారు.ప్రాముఖ్యత కలిగిన ఈ సమావేశానికి ఏలూరు ఏరియా పార్టీ శాఖ కార్యదర్శులు,ప్రజా సంఘాల బాధ్యులు హాజరై జయప్రదం చేయవలసినదిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యులు బళ్ల కనక దుర్గ రావు, భజంత్రీ శ్రీనివాస రావు,29వ డివిజన్ కార్యదర్శి గొర్లి స్వాతి, బేతా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం

విశాలాంధ్ర -భీమవరం: ఓటర్లందరూ తమ ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించి ఓటును వజ్రాయుధంగా వినియోగించాలని సిటీజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి కళా జాతాలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరుగుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడంలో కళారూపాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయ న్నారు. మాజీ సర్పంచ్ తాడినాడ బాబు ప్రసంగిస్తూ ఓటర్లను చైతన్యపరిచే కళా ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని ఆలోచింప చేసేవిగా ఉన్నాయని అన్నారు. డీఎన్నార్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ యువత ఓటు హక్కు ఉన్న విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా రంగం ప్రజా సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకులు ఆర్.రాజేష్ నేతృత్వంలో 11 మంది కళాకారులు నిర్వహించిన కళా ప్రదర్శనలు సబికులను ఆలోచింపచేసాయి. కార్యక్రమంలో దండు శ్రీనివాసరాజు, వై.వి.ఆనంద్, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ మాఫీ

విశాలాంధ్ర-ఏలూరు: ఆస్తి, ఖాళీ జాగా పన్ను పై వడ్డీ మాఫీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జీ. ఓ. ఎం. యస్. నెం. 35 ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంఘాలలో ఆస్తి , ఖాళీ జాగా పన్నులు ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, పన్ను పై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్‌గా పరిష్కరించుకోవాలని నగర పాలకసంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులు మున్సిపల్ ఆఫీసు ఇంటి పన్నుల వసూలు కౌంటర్‌లో, సచివాలయంలో చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు మాత్రమేనని, బకాయిల మొత్తాన్ని వెంటనే చెల్లించి వడ్డీ మాఫీ లబ్దిని పొందాలని కోరారు.

జిల్లాలో 33,400 మందికి విద్యా దీవెన

తల్లుల ఖాతాలో రూ.29 కోట్ల 69లక్షల17 వేల 209 మంజూరు
కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

విశాలాంధ్ర-భీమవరం: పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఆర్థిక భారం కాకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నియోజక వర్గం బహిరంగ సభ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానం ద్వారా 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి.. "జగనన్న విద్యా దీవెన" పూర్తి రీ యింబర్స్ మెంట్ లబ్ది మొత్తాన్ని ల్యాప్ టాప్ బటన్ నొక్కి.. అర్హులయిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేశారు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీక్షించారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 33,400 మంది విద్యార్థులకు మంజూరైన "జగనన్న విద్యా దీవెన" లబ్ది మొత్తం రూ.26,69,17,209ల మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 33,400 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.26,69,17,209 మంజూరైందన్నారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి విద్యా సంబంధిత సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి గణపతి రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభా రాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి పుష్ప రాణి, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, నర్సింగ్ ఇతర ప్రొఫైషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

6న మండల సమావేశం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎంఎస్ ప్రభాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ దండు వెంకటరామరాజు(అర్థవరం రాము) అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు సకాలంలో కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ఫోక్సో చట్టం అమలుపై నేడు అవగాహన

విశాలాంధ్ర-ఏలూరు: పోక్సో చట్టం అమలు, బాధితులకు సహాయక చర్యలు, ఎన్‌డిపిఎస్ చట్టం, అత్యాచారం, ఇతర నేరాలలో బాధిత మహిళలకు సహాయం, బాధిత మహిళలకు నల్సా సహాయ పథకం, తదితర అంశాలపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీసు, రెవిన్యూ, తదితర శాఖల అధికారులతో శనివారం ఉదయం గం. 10:30కి ఏలూరు జిల్లా ఎస్పి కార్యాలయంలోని సమావేశపు హాలులో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోలియోపై నిరంతర విజయం సాధించాలి

విశాలాంధ్ర - కైకలూరు : కొల్లేటి కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మెరుగైన వసతులు కల్పిస్తామని ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్ అన్నారు.శుక్రవారం శాసన సభ్యులు దూలం నాగేశ్వర రావు ఆదేశాల మీద కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ముందుగా ఈ నెల 3న పోలియో చుక్కలు కార్యక్రమ పోస్టర్ ను విడుదల చేసారు. అనంతరం ఎంపిపి అడవి కృష్ణ మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎండీ జహీర్, డాక్టర్ శంకర్, పందిరిపల్లిగూడెం సర్పంచ్ బలే రమణ సముద్రుడు, ఎంపీటీసి బలే నరేష్, తది తరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టాలి

- కళా ప్రదర్శనతో అవగాహన

విశాలాంధ్ర - లింగపాలెం : సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజలు అవగాహనతో ఉండాలని ధర్మాజీగూడెం ఎస్‌బిఐ మేనేజర్ మనోజ్‌కుమార్, హెచ్ఎం రాజు తెలిపారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వైవిఆర్ రూరల్ పబ్లిసిటి కళా బృందం ఆర్గనైజర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మ్యాజిక్ షో, కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు జరిగే తీరును కళారూపం ద్వారా వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఆధార్ కార్డు ఇవ్వకూడదని, నెంబరు తెలపకూడదని వీరు తెలిపారు. సైబర్ నేరాలు జరగకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ లక్కపాం ప్రకాశరావు తదితరలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై సవరణలు చేసుకోవాలి

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో రబీలో ఏడు వేల ఎకరాలలో పంటలు వేశారని, వీటిని ఈ-క్రాప్ నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ -క్రాప్ నమోదు వివరాలను రైతుభరోసా కేంద్రాలలో బహిరంగ జాబితాను ఉంచామని తెలిపారు. ఏమైనా సవరణలు ఉంటే ఈనెల 3వ తేదీలోపు వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్య సేవా కార్యక్రమాలు వినియోగించుకోవాలని గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎంఎస్ ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కొత్తపల్లి, వరదాపురం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 316 మందికి వైద్య సేవలు అందించారు. గర్భిణీలు, బాలింతలు, బీపీ, షుగర్ చిన్న పిల్లలు, వృద్దులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు మద్దాల రత్నకుమారి, గుర్రం సుబ్బారావు, వైద్యాధికారిణి డాక్టర్ సిహెచ్ కావ్య, డాక్టర్ పి. కిరణ్మయి, కంటి వైద్యాధికారి ఐ. శ్రీనివాసరావు, సిహెచ్ఓ జె. విల్సన్ బాబు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: కడుపు నొప్పి తాళలేక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెలగపాడు గ్రామానికి చెందిన గుడిదల చిన్న గురవయ్య కడుపునొప్పిని తట్టుకోలేక ఫిబ్రవరి 29వ తేదీన మధ్యాహ్నం పురుగుమందు త్రాగగా వెంటనే జంగారెడ్డిగూడెం నిర్మల ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున సుమారు రెండు గంటలకు మృతి చెందాడు. మృతుని కుమారుడు గుడుదల భీమయ్య ఫిర్యాదుతో ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీఎన్నార్‌లో ప్రపంచ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర -భీమవరం: మహిళ అబల కాదని సబలని , స్త్రీ శక్తి మహా శక్తి అని, సృష్టికి ప్రతి సృష్టి మహిళ అని డీఎన్నార్ విద్యా సంస్థల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, సౌందర్య బ్యూటీ క్లినిక్, పట్టణ కళాకారుల సౌజన్యంతో డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించే ప్రాంతాలు అభివృద్ధి పథంలో ఉంటాయని, నేడు రాష్ట్రపతి స్థాయికి మహిళాలు వెళ్ళినా అరాచకాలు, అత్యాచారాలు ఆగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజన్ కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు సామంత మణి మాట్లాడుతూ పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని, మూడున్నర దశాబ్దాలుగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పవిత్రమైన మహిళలకు ప్రపంచమే ఒక దినోత్సవంగా కల్పించిందంటే మహిళకు మంచి గౌరవం ఉందని, అందరూ మహిళలను గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో ఎండి సరోజినీ, శ్రీదేవీ, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంధాల యాధికారి కె.శిరీష, ఏ.హర్షిత, బి.సుష్మా, కే.శ్రీవల్లి, టి.తేజశ్రీ, పి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ సినీ కళాకారుల బృందానికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో బిజెపి నేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి తరుపున కమల రధం పేరుతో జబర్దస్త్ కళాకారులు, సినీ గాయని, గాయకులతో కూడిన బృందం 25 రోజులలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి 100కు పైగా ప్రదర్శనలు నిర్వహించి ప్రచారం చేయడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు గురువారం ఏలూరులోని సుంకరి వారి తోట లో జరిగిన 102వ ప్రదర్శనను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేసినట్లు సంస్థ ప్రతినిధి సుప్రీంకోర్టు న్యాయవాది వరప్రసాద్ అధికారికంగా ప్రకటించారు . ఈ సందర్భంగా కమల రధం ప్రచార బృందాన్ని ముందుండి నడిపించిన ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, ఇమ్మానియేల్, అప్పారావు, వినోద్, బాబి, సినీ గాయని, గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య బృందం సభ్యులకు అవార్డును, మెడల్స్ ను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దూకుడు సినిమా ఫేమ్ రమణ, రఘు, బిజెపి నాయకులు గాది రాంబాబు, నాగం శివ, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించాలి

విశాలాంధ్ర-చింతలపూడి: తేదేపా మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టిడిపి, జనసేన చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు.టిడిపి కార్యాలయంలో సూపర్ 6 పథకాల పోస్టర్ ను సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొంగా రోషన్ మాట్లాడుతూ చంద్రబాబు , పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన నిరుద్యోగులకు రూ.3వేల భృతి, స్కూల్ కి వెళ్లే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది విద్యార్థులకు ఏడాదికి రూ. 15వేలు, ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేల ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు 1500,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే బృహత్తర కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి సూపర్ సిక్స్ పథకాల కిట్‌ను బూత్ ఇన్‌చార్జిలకు,క్లస్టర్ కన్వీనర్లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య,లింగపాలెం మండల అధ్యక్షులు గరిమళ్ళ చలపతిరావు, నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వర రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, ఐటీడీపీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్,ఎస్ సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను,మాజీ ఎంపీటీసీ కనుమతరెడ్డి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే గుడ్ మార్నింగ్

విశాలాంధ్ర - కైకలూరు : ప్రజా సమస్యలను తెలుసు కుందాం అనే విధంగా నిత్యం ప్రజల్లో తిరుగుతున్న కైకలూరు శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు కైకలూరులో నూతన ఒరవడి ని ప్రజలకు పరిచయం చెయ్యాలని ప్రజా క్షేత్రంలో లో పాల్గొంటున్నారు.శుక్రవారం కైకలూరు-5 సచివాలయ పరిధిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా నాయకులతో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భముగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజాపాలన చేస్తున్నాం అన్నారు. ఇంకా ప్రజలకు సమస్యలు పరిష్కారం చెయ్యాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్,జడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి,వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్,మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్లు జంపన కొండరాజు, షేక్ రఫీ,పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, పల్లివాడ పిఎసిఎస్ అధ్యక్షులు గంగుల అశోక్,నిమ్మల సాయి, వైసీపీ సీనియర్ నాయకులు దండే రవి ప్రకాష్, కన్నా రమేష్,తులసి పూర్ణ, సుంకర శివ,నిమ్మల శ్రీనివాసు,అసాని ఖాన్, సాన శ్రీనివాసరావు,సమయం ఆంజనేయులు, చావలిపాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - గణపవరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగినట్లు గణపవరం శ్రీ చింతలపాటి బాపి రాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉప్పలపాటి రామచంద్ర రాజు శుక్రవారం తెలిపారు. ఈరోజు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలలో తెలుగు 56 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజర్ 53 మంది పరీక్షలు రాశారని, హిందీలో 19 మందికి ఒకరు గైర్హాజర్ 18 మంది రాశారని, సాంస్క్రిట్ 133 మందికి 133 రాశారని, ఒకేషనల్ 24 మందికి ఇద్దరు గైర్హాజర్ 22 మంది రాయడం జరిగిందని మొత్తం 232 మందికి విద్యార్థులకు గాను ఆరుగురు ఆబ్సెంట్ 226 మంది పరీక్షలు రాసినట్టు తెలిపారు.

తూర్పుతాళ్ళులో తాటాకిళ్లు దగ్ధం

విశాలాంధ్ర-నరసాపురం: మండలంలోని తూర్పుతాళ్ళు గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. తూర్పుతాళ్ళు సైపు వారి మెరకకు చెందిన ఆకుల సత్యనారాయణ తాటాకిళ్ళు శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి కే. భాస్కరరామం పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికి బాధితులు సర్వం కోల్పోయారు. భార్యతోపాటు తాను ఈ తాటాకింట్లో నివాసం ఉంటున్నానని, తన ముగ్గురు కుమార్తెలు వివాహాలు అయిపోవడంతో దూర ప్రాంతాల్లో ఉంటారని సత్యనారాయణ తెలిపారు. తన ఇల్లు కళ్ళ ముందు కాలిపోతున్నా ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-టి నరసాపురం : మర్రిగూడెం గ్రామంలో కురసం వెంకటేశ్వరరావు తాటాకిల్లు గురువారం షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధం కావడంతో నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని జడ్పీటీసీ సభ్యులు సామంత పూడి బాల సూర్యనారాయణ రాజు శుక్రవారం పరామర్శించి 5వేలు ఆర్థిక సహాయం తో పాటు ఇంటి సామగ్రి వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సోయం బిందు, వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ కురసం నిరీక్షణరావు, వార్డు మెంబర్ లు అధికారులు పాల్గొన్నారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర-నరసాపురం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభ మయ్యాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం, తెలుగు పరీక్షలు జరిగాయి. నర్సాపురంలో ఆదిత్య, శ్రీవైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీసూర్య , ఉమెన్స్, గౌతమి, భాస్కర కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష వ్రాసే వాళ్ళు ఎలాంటి సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా క్షణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ప్రతిరోజు పరీక్ష పూర్తయ్యేవరకు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ పరీక్షలలో మస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందని ఎంపీడీవో కే మంగతాయారు అన్నారు. శుక్రవారం దర్భ గూడెం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ఆరోగ్య వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు .ప్రతి ఒక్కరు ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సుమారు 412 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సున్నం ఉషారాణి, వైద్యులు గాయత్రి , ఎస్ కె సుల్తాన్, దీప్తి, పంచాయతీ కార్యదర్శి జే సుబ్రమణ్యం, సిహెచ్ఓ శ్రీనివాసరాజు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర - లింగపాలెం : ఎంఆర్పిఎస్ రిజర్వేషన్ పోరాటంలో అమరులైన వారికి ధర్మాజీగూడెంలో జరిగిన కార్యక్రమంలో నివాళులర్పించారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో ఇప్పటివరకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, వీరి త్యాగం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్‌బాబు, ముళ్ళపూడి సుమన్, సొంగా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలలో మొదటి రోజు ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. ఈ గ్రామంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటంతో ఇక్కడ చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. పరీక్షా కేంద్రాలను సమీపంలో ఏర్పాటు చేయటంతో విద్యార్థులు అవస్థలు పడకుండా ఉల్లాసంగా పరీక్షా కేంద్రాలకు వచ్చారు. స్థానిక ప్రభుత్వ, ప్రతిభ జూనియర్ కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 303 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 263 మంది పరీలు రాశారు. 40 మంది హాజరుకాలేదు. కేంద్రాలను ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ప్రభాకరరావు తనిఖీ చేశారు. కేంద్రాలలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పొదుపు చేయడం విద్యార్థి దశ నుండే నేర్చుకోవాలి

విశాలాంధ్ర-మండవల్లి: భవిష్యత్తు ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు విద్యార్థి దశ నుండే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు, ప్ర.ప.ఐక్యవే జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్.భాస్కరరావు,వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జి.రాజశ్రీ.సి.ఎఫ్.ఎల్ కౌన్సిలర్ పి.రాధ, దుర్గాప్రసాద్ అన్నారు. మండవల్లి మండలం లోకు మూడి గరువు వికాస్ డిగ్రీ కాలేజీలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీపై,ఆర్థిక అక్షరాస్యత కేంద్రం మండవల్లివారి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టీవీ వెంకటే శ్వర రావు అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత పై శుక్రవారం అవగాహన,చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మీ భవిష్యత్తు ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు పొదుపు ఒక మంచి మార్గం అన్నారు. కష్ట సమయంలో ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు రాధా, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో భాగంగా మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లోని రైతులు,చిన్న వ్యాపారులు కళాశాల విద్యార్థులు,సహాయక బృందాలు,సీనియర్ సిటిజన్లలో మంచి ఆర్థిక పద్ధతులు డిజిటల్ వినియోగదారుల రక్షణ గురించి అవగాహన పెంపొందించే కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో బిసి సిహెచ్ వెంకట కళ్యాణి, సిసి ఎం. మాధవి డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-వీరవాసరం: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వల్ల మాత్రమే సాధ్యమని, 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా అమలు చేయ దంతో పాటు ఎన్నికలలో ఇవ్వని హామీలను కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలో సుమారు రెండు కోట్ల 48 లక్షల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా తోలేరు గ్రామంలో 19 లక్షల 20 వేల నిధులతో నిర్మించిన వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, 23 లక్షల 94 నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 41 లక్షల 70 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి పైపులైన్ ఏర్పాటుకు, 18 లక్షలతో నిర్మించే సిసి డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అండలూరు గ్రామంలో 43 లక్షల 60 వేల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, 15 లక్షలతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఆయన ప్రారంభించారు. నౌదూరు గ్రామంలో 17 లక్షలతో నిర్మించిన వివో భవనాన్ని, 8 లక్షల 20 వేలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. తదనంతరం కొణితివాడ గ్రామంలో 34 లక్షల 20 వేల నిధులతో నిర్మించనున్న మంచినీటి సరఫరా పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర- ముసునూరు: ఉపాధి హామీ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ముసునూరు మండల ఎంపిడిఓ చాగంటి పద్మావతిదేవి అన్నారు.శుక్రవారం మండలంలోని ముసునూరు గ్రామంలో ఫీడర్ ఛానల్ లో జరుగుతున్న పనులను ఏపిఓ టి.రోజ్‌లీలా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీహామి పథకం పనిలోకి వచ్చేవారు తప్పని సరిగా వందరోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు.

పెద్దేవంలో గడప గడపకు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రభుత్వం పేద ప్రజలకు అందించిన సంక్షేమం ప్రజలకు చేరిన విధానాన్ని తెలుసుకునేందుకు, ఇంకా ప్రజలు కున్న అవసరాలను గుర్తించేందుకు ఎమ్మెల్యేను గ్రామాల్లో తిరగాలి అని ముఖ్యమంత్రి అదేశించారని, దీనిలో భాగమే గడప గడప కు మన ప్రభుత్వం అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దీనిలో భాగంగానే తాళ్ళపూడి మండలం లో మిగిలిపోయిన పెద్దేవం గ్రామం లో గడప గడప కు శ్రీకారం చుట్టానని తలారి తెలిపారు. పెద్దేవం లో వైకాపా నాయకులు, ఉప సర్పంచ్ తోట రామ కృష్ణ గృహం నుండి గడప గడప ప్రారంభించారు. ఇంటి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ వారి క్షేమాన్ని ఆరా తీస్తూ ఎమ్మెల్యే తలారి గడప గడప కొనసాగించారు. పెద్దేవం వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తలారి కి రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి డా. గూడూరి కి గ్రామం లోని నాయకులని తోట పరిచయం చేసారు. వైస్ ఏ.ఎం.సి కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు, వైకాపా నాయకులు కవల నాగేశ్వర రావు, బట్టు సుబ్బారావు, మండల వైకాపా అధ్యక్షులు కాకర్ల వెంకటేస్వరరావు, పలువురు వార్డు మెంబెర్లు, పంచాయతీ సెక్రటరీ సువర్చల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - జగ్గంపేట : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన బొడ్డు స్వామి దేవి దంపతుల కుమార్తె తాన్విక ఆసుపత్రి ఖర్చులకు 90 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం మాజీ మంత్రి, జగ్గంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోట నరసింహం అందజేశారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, నీలాద్రిరావు పేట సర్పంచ్ సురేష్ బాబు అధ్వర్యంలో ఈ చెక్కును తాన్విక తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి ఎంపిటిసి మద్దిపట్ల రామకృష్ణ, రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, అత్తులూరి సాయిబాబు, వైసిపి నాయకులు మట్ట బాపిరాజు, నక్క వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆహార పదార్థాలు అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గొల్లగూడెంలోని లగడపాటి రామలక్ష్మమ్మ వృద్ధాశ్రమానికి భాష్యం స్కూల్ చైర్మన్ భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా నిత్యవసర వస్తువులు పండ్లు ఆహార పదార్థాలు అందజేశారు. ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు నిత్యవసర వస్తువులు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం నిర్వాహకుడు కాగిత భాస్కరరావు మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు ఆహార పదార్థాలు నిత్యావసర వస్తువులు అందించిన రామకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, ప్రిన్సిపాల్ దాల్ షేక్ షబానా ఉపాధ్యాయులు ఎ. శేషకుమారి, ఎస్. మంజుల, ఎం. అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని పెనికేరు, చొప్పెల్ల గ్రామాలలో శుక్రవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఆయా గ్రామ సర్పంచులు వనుం చిన్నావతి జార్జి బాబు, దంగేటి చంద్రకళ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పెనికేరు గ్రామంలో అంబేద్కర్ కాలనీలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చొరవతో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు ద్వారా 18 లక్షలు మంజూరు చేయించగా చొప్పెల్ల గ్రామంలో నాగిరెడ్డి నగర్‌లో గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్లను అన్ని విధాల ఆదుకుంటాం

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణ పెయింటింగ్ వర్కర్లను అన్ని విధాల ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పెయింటింగ్ వర్కర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ దొరబాబు మాట్లాడుతూ పెయింటింగ్ వర్కర్లకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నా వంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ అందిస్తానని దొరబాబు అన్నారు. పెయింటింగ్ వర్కర్స్ అభ్యర్థన మేరకు యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ. పార్టీ నాయకులు తాడి రాజశేఖర్, నాగబోయిన రాజుబాబు తదితరులున్నారు.

వైసీపీ పాలనలో సంక్షేమం

విశాలాంధ్ర- చాట్రాయి : నిరుపేదల జీవితాల్లో నిరంతరం ఆర్థిక వెలుగులు నింపుతున్న చారిత్రాత్మకమైన సంక్షేమ పాలన వైసీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని చాట్రాయి గ్రామపంచాయతీ సర్పంచ్ దామెర ఉషా ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రం చాట్రాయి గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి తిరుగుతూ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాట్రాయి గ్రామంలో జగన్ పాలనలో 250 కొత్త పెన్షన్లు మంజూరు చేశామని అన్నారు. గ్రామంలో 690 పెన్షన్‌లు 20 లక్షల 91 వేల రూపాయలు ప్రతినెల పంపిణీ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు దామెర ప్రసాద్ బాబు, చాట్రాయి ఎంపీటీసీ సంకు శివకుమారి, సత్యనారాయణ, వెంకట్రావు, పాములపాటి ప్రసాద్ రెడ్డి, కుప్పిరెడ్డి వసంతం తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

విశాలాంధ్ర - కరప : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస నాయక్ పేర్కొన్నారు. కరప పీహెచ్సీ పరిధిలో ఈనెల మూడవ తేదీ ఆదివారం 28 బూత్లలో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వేలంగి పిహెచ్సీ పరిధిలో 20 బూత్లు ఈ పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఎంఎల్ హెచ్పీలు, ఏఎన్ఎమ్, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొంటారని నాయక్ తెలిపారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అమల్లో నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర - రాజానగరం : సార్వత్రిక ఎన్నికలల్లో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల అమల్లో నిర్లక్ష్యం తగదని, ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవిలత అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత,జిల్లా ఎస్పీ పి. జగదీష్ కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల బ్యాలెట్ యూనిట్స్(బాక్స్) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రీ రూరల్,అర్బన్, రాజానగరం, కొవ్వూరు, అనపర్తి ఆర్వోలు ఎన్.తేజ్ భరత్,కె.దినేష్ కుమార్,ఏ.చైత్ర వర్షిణి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలనకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ పిలుపు

విశాలాంధ్ర - కాకినాడ : రోజువారీ వాడకంలో ప్లాస్టిక్ బ్యాగులు, కవర్ల నిర్మూలనకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కాకినాడ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చింది. అందుకోసం తమ వంతు జిల్లా వ్యాప్తంగా జూట్ బ్యాగుల పంపిణీని ప్రారంభించింది. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జూట్ బ్యాగులను ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం పంపిణీ చేశారు. బ్యాగులను అందజేస్తూ ప్లాస్టిక్ బ్యాగుల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు వాటికి ప్రత్యామ్నాయ వినియోగ వస్తువుల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ప్లాస్టిక్ బ్యాగులు, కవర్ల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునివ్వాలని ప్రముఖ సామాజికవేత్త సానా సతీష్ బాబు సంకల్పించారన్నారు.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఎ++ గుర్తింపు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్ నందు గల ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌కు ఎన్ఎఎసి ఎ(నాక్ - ఎ ++) గుర్తింపు లభించినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారు కళాశాలలో గల ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయ, ఉపాద్యాయేతర సిబ్బంది మరియు మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించిన త్రిసభ్య బృందం సిఫారసు మేరకు తమ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు 3.51 స్కోర్‌తో "నాక్ ఎ++" గుర్తింపు లభించినట్లు సతీష్ రెడ్డి తెలిపారు. భారతదేశంలోని విద్యా సంస్థల, యూనివర్సిటీల యొక్క క్వాలిటీ స్టేటస్, కరిక్యులం, టీచింగ్, లెర్నింగ్, ప్రాసెస్, ఫ్యాకల్టీ రీసర్చ్ కళాశాల మౌలిక వసతుల ఆర్థిక వనరులు తదితర అంశాలకు ప్రాధాన్యత క్రమంలో ప్రమాణాలుగా తీసుకొని ఈ గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్‌లు డాక్టర్ పిఎస్‌వివిఎస్ రవి కుమార్, డాక్టర్ జి. రామకృష్ణ, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం మార్చి 9 వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 16 వ తేదీన (3వ శనివారం) నిర్వహించ నున్నట్లు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి. కె. ప్రత్యూష కుమారి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లోని అన్ని న్యాయస్థానాలలో అన్ని రకాల సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించు కోగలరని అన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి మార్చి 16 వ తేదీ 3 వ శనివారం రోజున జరుగు జాతీయ లోక్ అదాలత్ నందు వారి సమస్య లను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువత ఓటు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వచ్చే ఎన్నికల్లో యువత వినియోగించుకునే ఓటు రాష్ట్ర దశ దిశ మార్చేదిగా ఉండాలని టిడిపి అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏలేశ్వరంలో జరిగిన ఫస్ట్ ఓటు ఫర్ సిబిఎన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన అంతమొందించేందుకు టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు నియంతృత్వానికి, మానవత్వానికి మధ్య జరుగుతున్న పోరాటమని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెండ్ర శ్రీను, కోణాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, నాయకులు సూతి బూరయ్య, బస్సా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు ఉన్నారు. (కెకెడి 1-3- 2024, కెకెడి పిహెచ్ 23 :

అమరవీరుల త్యాగాలను జాతి మరవదు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మాదిగ అమరవీరుల త్యాగాలను జాతి ఎన్నటికీ మరువదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు అన్నారు. స్థానిక పెద్దవీధిలో గల బాబుజగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద శుక్రవారం ఎస్సీ వర్గీకరణ ఉద్యమాల్లో అశువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి అమరవీరుల ఆత్మ శాంతికి పోరాడతామన్నారు. సుప్రీంకోర్టులో కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అనుకూలంగా తీర్పు వస్తుందని యావత్ జాతి ఎదురుచూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు కాకాడ నాగేశ్వరరావు, మర్రివీడు మాజీ సర్పంచ్ గండేటి కిషోర్ కుమార్, సిరికోటి వీరబాబు, వేమగిరి ప్రేమానందం, కాకాడ చక్రవర్తి కార్యకర్తలు ఉన్నారు.

పల్స్ పోలీయో విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు మండల పరిధిలో ఈనెల మూడవ తేదీ ఆదివారం నిర్వహించనున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్న సిబ్బందికి గొల్లపాలెం పిహెచ్‌సి డాక్టర్ ఎస్. సౌజన్య కోరారు. ఈమేరకు సౌజన్య మాట్లాడుతూ గొల్లపాలెం, దుగ్గుదుర్రు పిహెచ్‌సిల పరిదిలో పల్స్ పోలియో విషయంలో తీసుకోనున్న జాగ్రత్తలు, పలు వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 0 నుంచి 5.సం.లలోపు పిల్లలందరికీ మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు గొల్లపాలెం పీహెచ్సీ, దుగ్గుదుర్రు పీహెచ్సీల పరిధిలోని పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆరోగ్య కేంద్రల సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలు "స్త్రైడ్స్ 2024" నిర్వహణ

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "స్త్రైడ్స్ 2024"లో ఇఇఇ విభాగం వారి "ఎక్సల్ట్ 2024", మెకానికల్ విభాగం వారి "ఎరుడైట్ 2024", ఇసిఇ విభాగం వారి "ఎజైవ్ 2024", సిఎస్‌డి విభాగం వారి "ఇ 2024" విభాగాల వారు ది.01-03-2024వ తేదీన "స్త్రైడ్ 2024" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా యంహెచ్‌యం కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ, (జెఎన్‌టియుకె) వారు విచ్చేశారని కళాశాల చైర్మన్ డాక్టర్ పి. కృష్ణారావు తెలియజేసారు. అనంతరం ముఖ్య అతిథి చేతి మీదుగా "స్త్రైడ్స్ 2024" సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి. కృష్ణారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రయోగాత్మక పరిజ్ఞానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందిచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా కె సత్యనారాయణ తెలియజేసారు.